

విడి వీగి పోయారు

- వనపర్తి మునిసిపాలిటీలో ముగిసిన అసమ్మతి పోరు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో చర్చలో కౌన్సిలర్ల రాజీ
- రెండు సామాజిక వర్గాలుగా చీలిపోయి అధిష్ఠానానికి జై..
- కౌన్సిలర్ల అసమ్మతి పోరు వీగిపోవడం ఇది రెండోసారి
- ఆరంభశూరుల మాటలతో కంగుతున్న తటస్థ కౌన్సిలర్లు



బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ కార్యాలయంలో కౌన్సిలర్లతో మాజీ మంత్రి చర్చలు

వనపర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వనపర్తి మునిసిపాలిటీలో కొన్ని రోజులుగా నడుస్తున్న అసమ్మతి పోరుకు ముగింపు లభించింది. హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయంలో సమావేశానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నుంచి పిలుపురాగా.. గురువారం వెళ్లిన కౌన్సిలర్లతో నిరంజన్ రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటుంటే.. ఈ సమయంలో అసమ్మతి పోరు రాజేయడేమంటనే ప్రశ్న వచ్చింది. దీంతో కౌన్సిలర్లంతా పార్టీ అధినాయకత్వం ఎలా ఆదేశిస్తే అలా నడుచుకుంటామని చెప్పారు. దీంతో నిరంజన్‌రెడ్డి, రావుల ప్రస్తుత పాలకవర్గాన్నే కొనసాగించాలని, భవిష్యత్‌లో అందరికీ సమపాళ్లలో న్యాయం జరిగేలా చూసుకుంటామని, అంతర్గత పోరును బయటకు తెచ్చి.. పార్టీని బలహీన పర్చవద్దని సూచించినట్లు సమాచారం. ఇంకా ఒక సంవత్సరం సమయం ఉండటం, వరుస ఎన్నికల నేపథ్యంలో పార్టీ గెలుపునకు సహకరించాలని వారు ఆదేశించారు. అంతకుముందు చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ప్రత్యేకంగా పిలిపించుకుని.. మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. అందరినీ కలుపుకుని పోకపోవడం వల్లనే ఈ సమస్య వచ్చిందని, ఇప్పుడు అవిశ్వాసం పెడితే.. కాంగ్రెస్ సీక్రెట్ బ్యాలెట్ పెట్టి కౌన్సిల్‌లోకి వారు ప్రవేశించడానికి అవకాశం కల్పించినట్లైతదని చెప్పినట్లు తెలుస్తోంది. ఇది లా ఉంటే.. వనపర్తి మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పలుమార్లు అసమ్మతి సెగలు రాజేయడం, ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకోవడం, తర్వాత నిరంజన్‌రెడ్డి కలుగజేసుకుని రాజీ కుదర్చడం జరుగుతోంది. అయితే రెండుసార్లు మాత్రం కచ్చితంగా అసమ్మతిపోరును వినిపించి.. గడువు ముగిసిన వెంటనే అవిశ్వాసం పెట్టాలనే ఆలోచనతో కౌన్సిలర్లు సమావేశం కాగా.. రెండుమార్లు చర్చల్లో కౌన్సిలర్ల మధ్య ఐక్యత లేకపోవడంతో అసమ్మతి వీగిపోయినట్లయ్యింది. వాస్తవానికి పార్టీలో, మునిసిపాలిటీలో కేవలం చైర్మన్, వైస్‌చైర్మన్‌లకు మాత్రమే అధికారాలు ఇవ్వడం, ప్రాధాన్యం ఇచ్చి అన్ని వార్డుల పనులు వారినే పర్యవేక్షించాలని ఆదేశించడం, దీంతో వారు కౌన్సిలర్లతో సంబంధం లేకుండా వార్డుల్లో కార్యక్రమాలు చేయడం పరిపాటిగా మారిపోయిందని కౌన్సిలర్లు ఇన్నాళ్లు ఆవేదన చెందారు. పలుమార్లు ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించుకున్నారు. ఎన్నికల సమయంలో కూడా తమకు సరిగా ప్రాధాన్యం ఇవ్వలేదని, గెలిచి నాలుగేళ్లవుతున్నా.. వార్డుల్లో సరిగా పనులు చేసుకోలేక పోయామనే అసంతృప్తితో ఉన్నారు. ఇవే కాకుండా కొందరు కౌన్సిలర్లు వర్గ పోరు వల్ల చైర్మన్, వైస్‌చైర్మన్‌ను దించితే.. వారు పదవిలోకి రావొచ్చనే భావనలో కూడా అసమ్మతిని పెంపొందించారు. అయితే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికంగా, రాష్ట్రంలో పార్టీ ఓడిపోవడంతో అధికారం కోల్పోయింది. దీన్ని కొందరు ఆసరాగా తీసుకుని.. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల మద్దతు కోరడంతోపాటు.. సొంత పార్టీలోని కౌన్సిలర్లను ఒక చోటకు చేర్చారు. ఈ విషయం తెలుసుకున్న నిరంజన్‌రెడ్డి ఓసారి సమావేశమైనా.. కౌన్సిలర్లు ససేమిరా అన్నారు. రెండో సమావేశం హైదరాబాద్‌లో పెట్టగా.. కౌన్సిలర్లు కచ్చితంగా మారతారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇందుకోసం మద్దతు తెలిపే కౌన్సిలర్లకు కొంత గుడ్‌విల్ అమౌంట్ సెటిల్ చేయాలని కూడా అనుకున్నారు. కానీ రెండో సమావేశం కౌన్సిలర్లు అనుకున్నట్లు కాకుండా.. అధిష్ఠానం అనుకున్నట్లు జరిగి.. చివరకు రాజీ కుదిరింది.

సామాజిక వర్గాల కొట్లాటతోనే..

మునిసిపాలిటీలో ప్రస్తుతం యాదవ సామాజిక వర్గానికి చెందిన గట్టుయాదవ్ చైర్మన్‌గా ఉండగా.. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన శ్రీధర్ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. వీరిపై గుర్రుగా ఉన్న కౌన్సిలర్లు సామాజిక వర్గ కూర్పు దెబ్బతినకుండా ఉండేందుకు అదే సామాజిక వర్గాలకు అవిశ్వాస తీర్మానం లేదా రాజీనామా తర్వాత పదవులు కేటాయించుకోవాలని భావించారు. మొదట చైర్మన్‌గా పాకనాటి కృష్ణ పేరు, వైస్‌చైర్మన్ పుట్టపాకుల మహేష్ పేరును అసమ్మతి కౌన్సిలర్లు అనుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తర్వాత విద్యావంతులు ఉంటే బాగుంటుందని కొందరు, సామాజిక వర్గ కూర్పు అలాగే ఉండటం ఎందుకు మార్చాలని కొందరు ప్రతిపాదనలు చేశారు. ఈ మధ్యలో నందిమల్ల భువనేశ్వరికి పదవి ఇప్పించాలని కూడా కొందరు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కు వెళ్లిన తర్వాత వీరిలో ఎవరినైనా ఒకరిని చేస్తారనే ప్రచారం జరిగింది. చైర్మన్ కూడా మాజీ మంత్రి ఇంట్లో జరిగిన సమావేశంలో వద్దంటే రాజీనామా చేస్తానని కూడా ప్రకటించినట్లు తెలిసింది. కానీ అనూహ్యంగా ముదిరాజ్, యాదవ సామాజిక వర్గాలకు చెందిన అసమ్మతి కౌన్సిలర్లంతా విడిపోవడంతో కథ అడ్డం తిరిగింది. అక్కడకు వెళ్లిన తర్వాత ఉమ్మడిగా నిర్ణయం చెప్పకుండా.. కేవలం మాజీ మంత్రి, మాజీ ఎంపీ ఏం చెబితే అదే వింటామని అనడంతో వారిని నమ్మి.. ఇన్నాళ్లుగా తిరుగుతున్న తటస్థ కౌన్సిలర్లు ఖంగుతిన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఈ అసమ్మతి సమావేశాలకు వెళ్లి భంగపడిన వారు.. ఇప్పుడు కూడా భంగపడ్డారు. భవిష్యత్‌లో అసమ్మతి, అవిశ్వాసం అంటే వెళ్లే పరిస్థితి లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం. అయితే ఇప్పటికే పలుమార్లు రాజీకి ఒప్పుకున్న కౌన్సిలర్లు మళ్లీ అదే పాట పాడటం పరిపాటిగా మారింది. మరి ఈసారైనా మాట మీద ఉంటారా? లేక హస్తం నేతలు కలుగజేసుకుంటే మళ్లీ అవిశ్వాసం, అసమ్మతి అంటారా? వేచిచూడాలి. అయితే అసమ్మతి కౌన్సిలర్లకు కొంతమొత్తంలో ముట్టజెప్పేందుకు కూడా ఒప్పందం కుదిరినట్లు సమాచారం. అయితే గడిచిన మూడురోజులుగా కూడా కొంతమందికి లోలోపల డబ్బులు అందజేశారని అందుకే వీగిపోయిందని తెలుస్తోంది.

ఇనాం భూములు అన్యాక్రాంతం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు
- విచారణ చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వినతి



రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జనవరి 4 : జడ్చర్ల నియోజకవర్గంలో ఇనాం భూముల అన్యాక్రాంతంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్, దొండ్లపల్లి, చొక్కంపేట గ్రామాల శివారులో సుమారు 600 ఎకరాల ఇనాం భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజాపూర్ మండలంలోని సర్వే నెంబరు 30లో 7- 29గుంటలు, 31లో 10-26గుంటలు, 44లో 2-33గుంటలు, 113లో 13-27గుంటలు, 108లో 17-22గుంటలు, 114లో 18-16గుంటలు, 107లో 8-20గుంటలు, 110లో 17-5గుంటలు, 100లో 9-06గుంటలు, 97లో 17-07గుంటలు, 83లో 11-14గుంటలు, 85లో 13-30గుంటలు, 117లో 10-07గుంటలు, 116లో 14-16గుంటలు, 115లో 16-16గుంటలు, 118లో 12-14గుంటలు, 88లో 16-24గుంటలు, 151లో 20-21గుంటల భూమి దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఇనాంగా ఇచ్చిందని తెలిపారు. ఆ భూములపై ఓఆర్‌సి సర్టిఫికెట్లను గుర్తుతెలియని వ్యక్తుల పేరుపై ఇప్పించి వెంచర్‌లుగా మార్చారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు రేంబో, స్వర్గసీమ, ఆర్‌ఎస్ బ్రదర్స్, కీర్తి సంస్థలు కొనుగోలు చేసి ప్లాట్లను విక్రయించేందుకు సిద్ధం చేసారని అన్నారు. ప్రస్తుతం ఆ భూములకు సంబంధించిన ఫైల్స్ అదనపు కలెక్టర్ కోర్టులో విచారణ నిమిత్తం పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా దళిత, గిరిజనుల నుంచి ఈ భూములు లాక్కున్నారు. ఈ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

మహిళ పై యాసిడ్ దాడి

- భూ తగాదాలే కారణమంటున్న స్థానికులు

కృష్ణ, జనవరి 4: భూ తగాదాతో మహిళపై యాసిడ్‌తో దాడి జరిగిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని ముడుమాల్‌లో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బాధితురాలు కవితారెడ్డి ఆమె భర్త కృష్ణారెడ్డి గ్రామ శివారులోని పొలం వద్ద నివాసం ఉంటున్నారు. కవితా రెడ్డి బుధవారం రాత్రి భోజనం ముగించుకొని ఇంట్లో నిద్రిస్తున్నది. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బుధవారం రాత్రి కవితారెడ్డి ఇంటికి వెళ్లి ఆమెపై ముఖంపై యాసిడ్ చల్లారు. ఆమె అరుపులు విన్న భర్త అక్కడికి చేరుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించి ఆమెను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కవితా రెడ్డి వాంగ్మూలం తీసుకుని గ్రామానికి చెందిన మడుగు వెంకటేష్, డీలర్ సీతారామరాజు, చౌదరిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు.

దివ్యాంగులకు తప్పని తిప్పలు

- సదరం సర్టిఫికెట్లకు సర్వర్ సమస్య
- నిమిషాల్లో స్లాట్ బుకింగ్‌లు పూర్తి
- ఇబ్బంది పడుతున్న దివ్యాంగులు



మీసేవ కేంద్రాలలో స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగుల నిరీక్షణ

ఖిల్లాఘణపురం, జనవరి 4: దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఈ నెల 3వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి సదరం సర్టిఫికెట్లకు స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారులు సూచించారు. దీంతో దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోవడానికి మీసేవ సెంటర్ల వద్దకు వెళ్తే కంప్యూటర్‌లో వేలిముద్రలు రాకపోవడం, బయోమెట్రిక్ ఇబ్బందులు, స్లాట్ బుకింగ్ ప్రారంభించిన కొన్ని నిమిషాల్లోనే సైట్ పోవడంతో దివ్యాంగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంద మంది మీ సేవా కేంద్రానికి వస్తే కనీసం పది మందికి కూడా స్లాట్ బుక్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దు



సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా వైద్య, ఆరోగ్య శాఖ ఎంజీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదరం సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్ తేదీని ఒక రోజు మొత్తం ఉండేటట్లుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మండలంలోని దివ్యాంగులకు మండల కేంద్రంలోనే వికలాంగత్వ పరీక్షలు చేయాలి.

- బెస్త యాదగిరి, దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖిల్లాఘణపురం

అవినీతి రహిత పాలనే కాంగ్రెస్ ధ్యేయం

- రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమంది ప్రాణత్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అమరవీరులు, ప్రజల ఆకాంక్షలు, అభీష్టం మేరకు అవినీతి రహిత ప్రజాపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని మంత్రి ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్న, పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌లతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాడు ఎంతో మంది ప్రాణత్యాగాలు చేస్తే కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని అన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమరవీరుల ఆకాంక్ష, ప్రజల అభీష్టం మేరకు పరిపాలన అందివ్వడం లేదని ఆగ్రహించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. అందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల ఆకాంక్షలు నెరవేరే విధంగా.. ప్రజల అభీష్టం మేరకు ప్రజాపాలన కొనసాగిస్తామని అన్నారు. ఇందుకు ఆయా శాఖల అధికారులు వారి సిబ్బంది పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపి, నూతన ఒరవడికి నాంది పలుకుదామని సూచించారు. అనంతరం ఆయా శాఖల వారీగా మంత్రి సమీక్షా నిర్వహించారు. మొదటగా మిషన్‌భగీరథపై సమీక్ష నిర్వహిస్తూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ అసమర్థ పాలన వలన తమ నియోజకవర్గంలోని చాలా ఆవాసాలకు మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదని ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణలు మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై మంత్రి అధికారులను వివరణ కోరగా సమగ్ర వివరణ రాకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇరిగేషన్, పౌరసరఫరాల, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య శాఖ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖపై ఒక రోజు పూర్తి సమీక్ష చేయాల్సినవసరం ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి కలెక్టరేట్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల ఆకాంక్ష మేరకు గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలన సవ్యంగా జరగలేదని అన్నారు. జిల్లాలో గత ప్రభుత్వం తాగునీటి పథకానికి చేసిన రూ.40వేల కోట్ల ఖర్చులో అక్రమాలు చోటు చేసుకున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన అందిస్తుందని, ప్రజలకు సేవకులుగా ఉంటామని అన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ సీతారా మరావు, జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు..

- జిల్లాలో ఫలితమివ్వని వేసెక్టమి ఆపరేషన్‌లు
- దాంపత్య జీవితానికి ఇబ్బంది అవుతుందని అపోహ
- అపోహలు వీడి పురుషులు ముందుకు రావాలి
- డాక్టర్ శశికళ, డీఎంహెచ్‌వో, గద్వాల



వేసెక్టమిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

గద్వాల న్యూటౌన్, జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ నియంత్రణలో పురుషులను భాగస్వామ్యం చేస్తూ వేసక్టమి ఆపరేషన్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా గతేడాది ఒక్కరు మాత్రమే వేసెక్టమి ఆపరేషన్ చేసుకున్నారు. ప్రభుత్వం పురుషులకు కోత, కుట్టు పనిలేకుండా వేసెక్టమి ద్వారా కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఆపరేషన్ వలన పురుషులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కేవలం 5 నిమిషాలలోనే ఆపరేషన్ పూర్తి చేస్తారు. ఇలా చేయించుకోవడం ద్వారా పురుషులకు రూ. 1,200 నగదు కూడా ఇస్తారు. కానీ ఈ ఆపరేషన్‌లు అవగాహన రాహిత్యంతో తెలంగాణలో జరుగడంలేదనే చెప్పవచ్చు. గత నెల 11 నుంచి 24 వరకు వేసక్టమి చేసేందుకు ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒక్క వేసెక్టమి ఆపరేషన్ మాత్రమే చేశారు. జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గం నుంచి మానవపాడు, క్యాతూరు, గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండలంతో పాటు మరికొంత మంది పురుషులు వేసక్టమి చేయించుకునేందుకు ముందుకు రాగా చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు. ఇక మరికొందరిని భార్యలే ఆ ఆపరేషన్ చేయించుకోవద్దని చెప్పడం కొసమెరుపుగా మారింది.

అపోహలు వీడాలి ..



వేసెక్టమి చేయించుకున్న పురుషులు సంసార జీవితానికి పనికిరారని కొందరు అపోహపడి ఆపరేషన్ చేయించుకోవడం లేదని తెలుస్తోంది. ఇది వాస్తవం కాదు. ఈ ఆపరేషన్ వల్ల శరీర పటుత్వానికి, దాంపత్య జీవితానికి ఎలాంటి ఆటంకం ఉండదు. పురుషులకు కోత, కుట్లు లేకుండా కేవలం 5 నిమిషాలలోనే ఈ ఆపరేషన్ పూర్తి అవుతుంది. దీంతో కుటుంబ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి ఈ ఆపరేషన్‌లు ఎంతో దోహదపడుతుంది.

- డాక్టర్ శశికళ, డీఎంహెచ్, గద్వాల

పాలమూరు, జనవరి 4 : మహబూబ్‌నగర్ జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్‌గా గంజి ఆంజనేయులు, 11మందితో అడహక్ కమిటీని నియమించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీని జిల్లా అధికారి డి.రాధారోహిణి ప్రకటించారు. చీఫ్ ప్రమోటర్‌గా గంజి ఆంజనేయులు, సభ్యులుగా పి.మురళి, జి.తిరుతపయ్య, వి.లక్ష్మీనరసింహ, కె.కృష్ణయ్య, ఎస్.లక్ష్మయ్య, కె.రామచంద్రయ్య, డి.ఆనంద్,

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్‌గా ఆంజనేయులు



ఎంపికైన అడహక్ కమిటీని అభినందిస్తున్న అధికారులు

బి.వెంకట్రాములు, బి.వెంకట్రాములు, కె.యాదయ్యలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు మహేశ్వర్‌రెడ్డి, మధన్‌మోహన్, నవీన్‌కుమార్, రాందాసు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించిన అధికారులు (ఫైల్)



చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంపే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలలకు స్ఫూర్తిదాయకం గ్రంథాలయ పుస్తకాలు
- నారాయణపేట జిల్లాలో 80 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఎంపిక
- 48 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తకాలు

నారాయణపేట, జనవరి 4 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా, పరిజ్ఞానంపై పట్టు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం గ్రంథాలయాలను సమ కూరుస్తోంది. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతత, భాష అభివృద్ధి, నైతిక విలువలు పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో స్ఫూర్తి దాయకమైన పుస్తకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 80 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంపిక చేసింది. తరగతుల వారిగా ఆరు నుంచి పదో తరగతి వరకు 48 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గుర్తించి వాటికి నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా (ఎన్‌బీటీ) పుస్తకాలతో గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. 50 ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు, 30 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 8వ తరగతి వరకు గుర్తించి అందులో గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో తెలుగు మీడియానికి సంబంధించి ఆరు నుంచి 8వ తరగతి వరకు 22 పుస్తకాలు, తొమ్మిది నుంచి పదో తరగతి వరకు 14 పుస్తకాలు మొత్తం 36 పుస్తకాలను కేటాయించింది. హిందీ మీడియానికి సంబంధించి ఆరు నుంచి 8వ తరగ తి వరకు 14 పుస్తకాలు, తొమ్మిది నుంచి పది వరకు 14 పుస్తకాలు మొత్తం 28 పుస్తకాలు, ఇంగ్లిష్ మీడియానికి సంబంధించి ఆరు నుంచి 8వ తరగతి వరకు 38 పుస్తకాలు, తొమ్మిది నుంచి పదో తరగతి వరకు 18 పుస్తకాలు ఇలా మొత్తం 56 పుస్తకాలను నేషనల్ బుక్ ట్రస్ట్ ఢిల్లీ నుంచి అందించింది. ఈ పుస్తకాల్లో కథలు, సాహిత్యం, స్వాతంత్ర్య సమరయోధుల విజయ గాథలు, స్ఫూర్తిదాయక కథనాలను ఇలా అనేక అంశాలను పొందుపరిచారు. ఆరవ తరగతి నుంచి గణిత పరిజ్ఞానం పెంపొందించేందుకు పుస్తక పఠనం, తరగతి బోధనపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థిలో సామర్థ్యం పెంచేలా చర్యలు చేపడుతున్నారు. చదువు, పరీక్ష ఫలితాలు, స్థాయి నిర్ధారణ తదితర వాటిలో విద్యార్థులు ఒత్తిడికి గురౌతున్న నేపథ్యంలో విద్యాభ్యాసంతో పాటు మానసిక ప్రశాంతత కల్పించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి వాటికి అనువైన గదులు, ర్యాకర్స్‌లను అందుబాటులో ఉంచారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకునేలా ఆ పుస్తకాలను చదివేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సెక్టోరియల్ అధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు.

తుంపర సేద్యం వైపు అన్నదాతల చూపు

- గత ప్రభుత్వ హయాంలోనే అంతంత మాత్రంగానే స్ప్రింక్లర్లు, డ్రిప్పు పైపుల పంపిణీ
- సబ్సిడీ స్ప్రింక్లర్ల కోసం అన్నదాతల ఎదురు చూపులు
- ప్రస్తుతం ప్రభుత్వమైనా సమృద్ధిగా అందించాలంటున్న రైతులు

తాడూరు, జనవరి 4 : గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న అన్నదాతలకు సమృద్ధిగా స్ప్రింక్లర్లు వాటికి వాడే పైపులు బిందు సేద్యానికి సంబంధించిన డ్రిప్పు వంటి సామాగ్రి రాయితీపై ప్రభుత్వాలు అందించకపోవడం మూలంగా అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం వీటి పంపిణీ అంతంత మాత్రంగానే నిర్వహించడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో వేల రూపాయలు పోసి కొనుక్కుని వ్యవసాయానికి వినియోగించుకునే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురియకపోవడం మూలంగా కృష్ణానది ప్రవాహం తగ్గి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు పూర్తిస్థాయిలో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కేఎల్ఐ కాల్వ నీటి ప్రవాహం ఆగిపోవడంతో అన్నదాతలందరూ సొంతంగా ఉండే నీటి వనరులపై ఆధారపడే పరిస్థితి నెలకొంది. ఇందులో ప్రధానంగా సమృద్ధిగా నీరు బోర్లలో ఉన్నప్పటికీ వాటిని పంటలకు అందించే ప్రక్రియలో ప్రధానంగా స్ప్రింక్లర్లు, డ్రిప్పే కీలకం. ప్రస్తుతం రైతుల చేతుల్లో అనుకున్నంత మేర స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు లేకపోవడం మూలంగా యాసంగిలో సాగు చేసే పంటలపై తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా రైతులకు రాయితీపై స్ప్రింక్లర్ పైపులతోపాటు డ్రిప్, మందు పిచికారి యంత్రాలు, పవర్‌స్ప్రేయర్లు, హ్యాండ్ స్ప్రేయర్లతో పాటు మరికొన్ని వాటిని రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటే తమపే ఆదుకున్నవారవుతారని రైతులు కోరుతున్నారు.



:సిర్సవాడ గ్రామ సమీపంలో స్ప్రింక్లర్లతో పత్తిపంటకు నీరందిస్తున్న రైతులు (ఫైల్)

రేషన్ బియ్యం పక్కదారి

- పలు రైస్ మిల్లుల్లో సన్న బియ్యంగా గ్రైండింగ్ చేస్తున్నారా?
- నిత్యం క్వింటాళ్లలో బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- పట్టించుకోని సివిల్ సప్లయ్ అధికారులు

కోస్గి రూరల్, జనవరి 4 : రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్లోకి విచ్చలవిడిగా రవాణా జరుగుతోంది. పది రూపాయలకు కిలో చొప్పున లబ్ధిదారులతో క్వింటాళ్ల కొద్ది పీడీఎస్ బియ్యాన్ని పలువురు వ్యాపారులు కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నారు. దీన్ని అదునుగా చేసుకొని పలువురు రైస్‌మిల్లర్లు సైతం రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. రీసైక్లింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి రూ.30 - 40కి కిలో చొప్పున మార్కెట్లో అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగా మార్కెట్లో జోరుగా జరుగుతున్న సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవ హరిస్తున్నారు. ప్రభుత్వం నిరుపేదలకు అన్నం పెట్టాలన్న సంకల్పంతో రేషన్ బియ్యం సరఫరా చేస్తుంటే పలువురు దళారులు అధికారులలతో కుమ్మక్కై దర్జాగా ఆయా దుకాణాల్లోనే రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలు, డీసీఎంలలో మద్దూర్, కర్ణాటకలోని గుర్మిట్కల్‌కు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని పలువు రు కోరుతున్నారు.



డీసీఎంలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

ఇదే విషయాన్ని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులను అడిగేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

గొర్రెలు పంపిణీ చేయాలి



వెటర్నరీ ఏడీకి వినతిపత్రం ఇస్తున్న కురుమ యాదవులు

నారాయణపేట/రూరల్, జనవరి 4 : గొర్రెల పంపిణీ కోసం గత మార్చిలో డీడీలు కట్టిన వారికి వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరుతూ గురువారం మండలంలోని లక్ష్మీపూర్, జలాల్‌పూర్, భైరంకొండ, ఎక్లాస్‌పూర్, అంత్వార్ గ్రామాల లబ్ధిదారులు వెటర్నరీ ఏడీ శ్రీనివాస్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది మార్చిలో 5,912 మంది రూ.43,750 ప్రకారం ప్రతీ డీడీకి చెల్లించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రెండో విడత గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో డీడీలు తీసి అప్పులు కట్టలేని స్థితిలో ఉన్నార న్నారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుని కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం వారికి వెంటనే గొర్రెలు పంపిణీ చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకం దారుల సంఘం నాయకులు బాల్‌రాజ్, వెంకటప్ప, శివలింగప్ప పాల్గొన్నారు.

మిడ్జిల్ వైస్ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం



బలనిరూపణ పరీక్షకు హాజరైన ఎంపీటీసీ సభ్యులు, అధికారులు

మిడ్జిల్, జనవరి 4 : మండలంలోని మొత్తం 9 మంది ఎంపీటీసీలు ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ బరిగెల సుదర్శన్, వైస్ ఎంపీపీ తిరుపతమ్మరవీందర్‌గౌడ్‌లపై డిసెంబరు 18న అవిశ్వాసానికి సంబంధించిన నోటీసులను జిల్లా అధికారులకు అందజేశారు. ఇటీవల అధికారులు జనవరి 4న ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం ఉంటుందని, బలనిరూపణ చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఎంపీపీ సుదర్శన్ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోగా, వైస్ ఎంపీపీ తిరుపతమ్మరవీందర్‌గౌడ్‌పై గురువారం బల నిరూపణను జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. బలనిరూపణకు మొత్తం ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు అవసరం ఉండగా ఎంపీటీసీలు గౌస్, కాంతమ్మ, రాజారెడ్డి, నర్సింహ, శంకరయ్య మాత్రమే హాజరు కావడంతో ఇచ్చిన నోటీసును పరిగణలోకి తీసుకొనబడదని రెవెన్యూ డివిజనల్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. కాగా అవిశ్వాస నోటీసులు అధికారులకు అందజేసిన సమయంలో ఉన్న దోనూర్ ఎంపీటీసీ సభ్యురాలు వసంత రమేష్ గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిలక్ష్మి, వైస్ ఎంపీపీ తిరుపతమ్మరవీందర్ పాల్గొన్నారు.

జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో యాచకుడి మృతి

జడ్చర్ల, జనవరి 4 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్ ఆవరణలో యాచకుడు మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు. వనపర్తి జిల్లా గోపాలపేట్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు బత్తుల దశరథం (44) జడ్చర్ల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో భిక్షాటన చేస్తూ, రైల్వేస్టేషన్‌లో ఉంటున్నాడని, బుధవారం రాత్రి సహజ మరణం చెందాడని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. సంఘటనపై విచారణ చేపట్టి, మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

పాలమూరులో ఒక కరోనా కేసు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జనవరి 4 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక కరోనా కేసు నమోదైంది. మొత్తం 90 మందికి పరీక్షలు చేయగా, ఒకరికి కరోనా ఉన్నట్లు గుర్తించారు. అడ్డాకుల మండలంలోని ఓ గ్రామంలోని ఓ విద్యార్థికి కరోనా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థి వారం రోజులుగా జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు ఉండడంతో పరీక్షలు చేయగా, కరోనా ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఆ విద్యార్థి ఇంట్లో ఐసోలేషన్‌లో ఉన్నాడు.

వణికిస్తున్న చలి

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

మహబూబ్‌నగర్, జనవరి 4 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా చలి రోజు రోజుకు పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలికి ప్రజలు వణికిపోతున్నారు. చలి నుంచి రక్షణ పొందేందుకు చిన్నారులతో పాటు వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. గురువారం వనపర్తి జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 33.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.5 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 16.7 డిగ్రీలుగా నమోదైంది. నారాయణపేట జిల్లాలో అత్యధికంగా 29 డిగ్రీలు, అత్యల్పంగా 18 డిగ్రీలు నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లిలో గరిష్ఠం ఉష్ణోగ్రత 30.3 డిగ్రీలు, కనిష్ఠం ఉష్ణోగ్రత 18.5 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 30.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.5 డిగ్రీలు నమోదైంది.

యువకుడి వేధింపులకు తాళలేక యువతి ఆత్మహత్య

మక్తల్, జనవరి 4 : యువకుడి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పర్వతాలు కథనం ప్రకారం.. మక్తల్ పట్టణానికి చెందిన మైనర్ బాలిక గత ఏడాది నుంచి కూలీ పని నిమిత్తం చందాపూర్ గ్రామానికి చెందిన ఈడిగి వెంకటేష్ ఆటోలో నిత్యం వెళ్లేది. ఈ క్రమంలో ప్రేమించాలని అమ్మాయిని వెంట పడటంతో వేధింపులు తట్టుకోలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై అమ్మాయి తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

రేవల్లి, జనవరి 4 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డే కాంతయ్య సమీప బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు కుటుంబీకులతో కలిసి బుధవారం వేరే గ్రామానికి వెళ్లారు. కాంతయ్య పెద్ద కుమారుడు నరసింహ(48) పెళ్లి రోజు వస్తానని చెప్పి ఇంట్లో ఉండిపోయాడు. గురువారం పెళ్లికి నరసింహ రాకపోవడంతో అనుమానం వచ్చిన వారు కార్యక్రమాన్ని ముగించుకొని గ్రామానికి వచ్చారు. బుధవారం ఉదయం కొత్త చేపల వల కొన్న నరసింహ చేపల వేటకు వెళ్లి ఉంటాడని భావించి గ్రామంలో ఉన్న రామసముద్రం చెరువు వద్దకు వెళ్లారు. ఒడ్డుపై నరసింహ బట్టలు, చెప్పులు, ఫోన్ కనిపించాయి. వాటిని చూసిన తల్లిదండ్రులు అవి నరసింహవేనని గుర్తించారు. అయితే, అప్పటికే చీకటి కావడంతో చెరువులో వెతకడానికి వీలు కాలేదు. కుమారుడి కోసం తల్లిదండ్రులు రోదిస్తూ అక్కడే కూర్చున్నారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందజేస్తామని నరసింహ తండ్రి కాంతయ్య తెలిపారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం



అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును పరిశీలిస్తున్న ఆర్‌ఐ గణేష్

ఖిల్లాఘణపురం, జనవరి 4 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని గ్రామ యువకులు అడ్డుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆదర్శ యువజన సంఘం భవనం పక్క స్థలం సర్వే నంబర్ తొమ్మిది ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రికి రాత్రి రేకుల షెడ్డును ఏర్పాటు చేశాడు. పంక్చర్ దుకాణం ఏర్పాటు చేసేందుకు ప్రెస్‌క్లబ్ భవనం వెనుక భాగంలో భూమిని కబ్జా చేస్తున్నాడని గ్రామ యువకులు తహసీల్దార్ పాండుకు ఫిర్యాదు చేశారు. మండలంలోని నాయకుల అండదండలతోనే సదరు వ్యక్తి ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని వారు ఆరోపించారు. ప్రభుత్వ భూములు కాపాడడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ భూముల్లో రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్ సహాయంతో భూమిని చదును చేసి షెడ్డు నిర్మాణం చేయడం దారుణమని తెలిపారు. అక్రమంగా నిర్మాణం చేసిన షెడ్డును గ్రామ యువకులు అడ్డుకోవడంతో తహసీల్దార్ ఆదేశాలతో ఆర్‌ఐ గణేష్ పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించకపోతే ప్రభుత్వ భూముల కబ్జాపై పోరాటం చేస్తామని గ్రామ యువకులు తెలిపారు. షెడ్డును వెంటనే తొలగించేందుకు నోటీసులు జారీ చేస్తామని సర్పంచ్ వెంకటరమణ తెలిపారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల బృందం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 4: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో ఒలంపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. గత నవంబరులో నిర్వహించి ఐఎన్‌టీఎస్‌వో లెవల్-1 ఒలంపియాడ్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థులు పాల్గొని 106 మంది లెవల్-2కు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ రాజీవ్ ప్రియదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కోఆర్డినేటర్ మధుసూదన్, డీన్ శివకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మూడు మేకపోతుల అపహరణ

చారకొండ, జనవరి 4: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన నూనే ముత్యాలుకు చెందిన మేకల దొడ్డిలో కట్టేసి ఉంచిన మూడు మేకపోతులను గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపారు. మేకపోతుల విలువ రూ. 50 వేలు వుంటుందని పేర్కొన్నారు. బాధితుడు నూనే ముత్యాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం అందేనా?

గత వర్షాకాలంలో మండల వ్యాప్తంగా 64 ఇళ్లకు నష్టం

ఆరు నెలలు పూర్తి అయినా అందని పరిహారం



అల్లాపూర్‌లో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

తాడూరు, జనవరి 4 : గత వర్షాకాలంలో 15రోజుల పాటు నిరంతరాయం గా ముసురు వర్షం కురియడంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో అధికారుల లెక్కల ప్రకారం 64ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి గత ప్రభుత్వానికి మండల రెవెన్యూ శాఖ అధికారులు నివేదికలు పంపినా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిని నష్టపోయిన లబ్ధిదారులకు ఎలాంటి పరిహారం అందించలేదు. దీంతో పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న వారందరూ పరిహారం అందుతుందని ఆశ పడినప్పటికీ అది నిరాశగానే మిగిలింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఇళ్లు నష్టపో యిన వారికి నష్ట పరిహారం అందించేలా అధికారులు కృషి చేయాలని గ్రామాల్లోని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న వారు కోరుతున్నారు. ప్రధానంగా మండలంలోని అల్లాపూర్, యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, సిర్సవాడతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి.

వరాలిచ్చే.. లక్ష్మీనరసింహుడు

ఈ నెల 15 నుంచి సింగోటం బ్రహ్మోత్సవాలు ▸ 18న రథోత్సవం

కొల్లాపూర్, జనవరి 4 : ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆలయం ఒక పేరుతో ప్రసిద్ధి చెంది.. మరొక రూపంలో దేవుడు దర్శనమిస్తూ భక్తులను కట్టి పడేస్తుంది. ఆ క్షేత్రంలో లక్ష్మీనరసింహుడు భయాలను పారద్రోలి వరలనొసగే కల్పతరువుగా వాసికెక్కాడు. ఆ పావన ప్రదేశమే సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. సంక్రాంతి మరుసటి రోజుతో జాతరకు అంకురార్పణ కానుంది.

ఆలయ విశిష్టత

శివాలయంలో శివుడు మాత్రమే ఉంటాడు. వైష్ణవ ఆలయంలో విష్ణువు మాత్రమే దర్శనమిస్తాడు కానీ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో వైష్ణవ ఆలయంగా ప్రసిద్ధి చెందిన సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాత్రం దేవుడు లింగాకారంలో దర్శనమిస్తున్నాడు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా శివకేశవులు కలిసి వెలసిన దివ్యక్షేత్రం సింగోటం, సాక్షాత్తు నరసింహస్వామి స్వయంభువుగా వెలసిన పుణ్యక్షేత్రం సింగోటం. ఇక్కడి ఆలయంలో లింగాకారంలో నరసింహుడు ప్రతి సంవత్సరం పెరుగుతుండడం ఇక్కడి విశిష్టత. అందుకే ఇక్కడి ఆలయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

- సింగోటం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహుడికి పెద్దచరిత్ర ఉంది. క్రీస్తుశకం 13వ శతాబ్దంలో సురభి రాజైన సింగమ భూపాలుడు అనే రాజు గ్రామాన్ని పరిపాలిస్తుండేవాడు. అదే సమయంలో గ్రామంలో హరిభక్తుడైన రైతు తన పొలంలో దున్నుతుండగా నాగేటి కర్రకు రాయిలాంటిది అడ్డుపడింది. దాన్ని తీసి గట్టుపైకి విసిరేసి మళ్లీ దున్నడం ప్రారంభించాడు. కానీ మళ్లీ అదే పరిస్థితి కొన్ని రోజులు అలాగే జరిగింది. దీంతో ఆ దేవదేవుడు ఆ ఊరి రాజైన సింగమ భూపాలునికి కలలో కన్పించి తన వల్ల రైతు ఇబ్బంది పడుతున్నాడని, తనను గుర్తించడం లేదని తాను అక్కడే ఉండదలిచాను కాబట్టి అందుకు కావాల్సిన నిర్మాణం చేపట్టి జన్మను చరితార్థం చేసుకోమని రాజును ఆజ్ఞాపించాడు నరసింహుడు. సహజంగానే దైవభక్తుడైన సింగమ భూపాలుడు ఆలయం నిర్మించాడు.

రత్నగిరి కొండపై..

ఈ ఆలయానికి ఎదురుగా కిలో మీటరు దూరంలో ఉన్న ఎతైన రత్నగిరికి కొండమీద శ్రీరత్నలక్ష్మీ ఆలయం ఉంది. క్రీస్తుశకం 1875ప్రాంతంలో రాణిరత్నమాంబదేవి ఈ ఆలయాన్ని నిర్మింపజేస్తూ మద్రాసు నుంచి లక్ష్మీదేవి విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్ఠించారు. నరసింహస్వామి ఆలయానికి ముందు వివాహాలు జరిపేందుకు కల్యాణ మండపం కూడా నిర్మించి ఉంది.



సింగోటం లక్ష్మీనరసింహ స్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) లక్ష్మీనరసింహుడు

ఆదేవిధంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎడమ వైపు శ్రీవారి సముద్రం, కుడివైపు రత్నపుష్కరిణి అనే కోనేరు ఉంది. ఆలయం ముందు భాగంలో లక్ష్మీగణపతి మందిరం, నవగ్రహ మండపం, ఉట్ల స్తంభం దర్శనమిస్తాయి. ఆలయం వెనక భాగంలో భక్తుల కోసం కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ముందు భాగంలో కూడా ప్రైవేట్ టూరిజం కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్రహ్మోత్సవాల వివరాలు..

ఈ నెల 15 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 16వ తేదీ రోజు అభిషేక మహోత్సవం, బ్రహ్మోత్సవ సంకల్పం, గణపతి పుణ్యాహవచనం, అఖండ స్థాపన, నవగ్రహ వాస్తు, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ పాణాది కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సాయంత్రం అశ్వ వాహన సేవ, మోహిని అలంకరణ, రాత్రి ఎనిమిది గంటలకు లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం, గజ వాహన సేవ నిర్వహిస్తారు. అదే విధంగా 17న ప్రభోత్సవం, సింహవాహన సేవ, 18న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన బ్రహ్మోత్సవం, తేరు, రథోత్సవం, 19న ఉదయం అమ్మవారి అభిషేక ఉత్సవం రాత్రి ఏడు గంటలకు స్వామి వారి పుష్కరిణి లో తెప్పోత్సవం, 20న ప్రత్యేక శేష వాహన సేవ, 21న హంస వాహన సేవా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

నేడు ఏర్పాట్లపై మంత్రి జూపల్లి సమీక్ష

సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాటి ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ఆబ్కారీ, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించనున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుడి హఠాన్మరణం

గుండెపోటుతో ఆల శశివర్ధన్‌రెడ్డి మృతి

అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే, ఎంపీ, మాజీ ఎంపీ, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

భూత్పూర్, జనవరి 4 : దేవరకద్ర నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి (61) గురువారం అర్ధరాత్రి గుండె పోటుతో హఠాత్ మరణం చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు. అన్న ఆల శశివర్ధన్‌రెడ్డి పార్థివ దేహాన్ని చూసి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో బోరునా విలపించారు. తల్లి వరలక్ష్మి రోదనలు పలువురికి కంటతడి పెట్టించాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్య యాదవ్, గువ్వల బాలరాజు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి, వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, దేవరకద్ర నియోజవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ జీవన్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు దేవరకద్ర, పాలమూరు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు తరలి వచ్చి ఆల శశివర్ధన్‌రెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని ఓదార్చారు. అనంతరం ఆల శశివర్ధర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శశివర్ధన్‌రెడ్డి మృతితో అన్నాసాగర్ గ్రామస్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



ఆల శశివర్ధన్ పార్థివదేహం వద్ద పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

ఇసుక డంపులపై పోలీసుల మెరుపు దాడి

పట్టుబడిన ఇసుక డంపులు రెవెన్యూ శాఖకు అప్పగింత

జడ్చర్ల, జనవరి 4 : దుందుభీ నది పరివాహక ప్రాంతంలో యథేచ్ఛగా సాగిస్తున్న ఇసుక అక్రమ వ్యాపారంపై జడ్చర్ల పోలీసులు మెరుపు దాడి చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం అమ్మపల్లి శివారులో టన్నుల కొద్ది ఇసుక మేటలను డంపు చేశారన్న సమాచారం అందుకున్న జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు తన సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో దాదాపు 6, 7 లక్షల రూపాయల విలువగల సుమారు వెయ్యి టన్నుల ఇసుక(40 టిప్పర్‌లు)ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక వద్ద రాత్రి అంతా కాపుకాశారు. పట్టుబడిన ఇసుకను గురువారం ఉదయం జడ్చర్ల రెవెన్యూశాఖ అధికారులకు అప్పగించారు. కాగా రెవెన్యూశాఖలో గతంలో గ్రామాలలో కావలికారు ఉండడంతో సీజ్ చేసిన వాటి వద్ద కావలికార్లు కాపు కాసేవారు. ఇప్పుడు రెవెన్యూశాఖలో కావలికార్లు తక్కువగా ఉండడంతో సీజ్ చేసిన ఇసుక డంపులను ఇసుకాసురల నుంచి ఎలా కాపాడుకుంటారనే ప్రశ్న తలెత్తుతోంది. డంపు చేసిన ఇసుకను తెల్లవారుజాము నుంచి ట్రాక్టర్‌లు, టిప్పర్‌లలో జడ్చర్లతో పాటు మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలను కొందరు అక్రమార్కులు ఆర్జిస్తున్నారు.

ఈ అంశంపై పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అమ్మపల్లి సమీపంలో స్వాధీనం చేసుకున్న ఇసుక డంపుల వద్ద పోలీసు సిబ్బంది

అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి

వికసిత్ భారత్ కార్యక్రమంలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

మిడ్జిల్, జనవరి 4 : దేశంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కంచనపల్లి, బైరంపల్లి గ్రామాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆయా గ్రామాలలోని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మిథున్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె తిరుపతి, మండల అధ్యక్షుడు కావలి లాలు, నాయకులు సాహితి రెడ్డి, శేఖర్, వాసుదేవ్, నాగేష్, మహేష్, అంజి, చెన్నయ్య నవీన్, బాలయ్య, గొడుగు శివ ఉన్నారు.

రెండు గుడిసెలు దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన గుడిసెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

కేటీదొడ్డి, జనవరి 4 : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని గంగన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల శివరంగాపురంలో బుధవారం రాత్రి రెండు గుడిసెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. గుడిసెలోని వస్తువులు, నగదు, దుస్తులు కాలి బూడిదయ్యాయని బాధితులు కొండాపురం నర్సింహులు, కొండాపురం ఆనంద్ తెలిపారు. గుడిసెల్లో ఉన్న నగదు, బంగారం, ధాన్యం, వస్తు సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యిందని, దాదాపు ఎనిమిది లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సూచించారు. తన సహాయసహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్ గౌడ్, జడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, బీఆర్ఎస్ నాయకులు గోపి, ప్రతాప్ రెడ్డి, రాజేష్, వెంకటన్నగౌడ్, నర్సింహులు, కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కాలువలో రైతుల మోటార్లు మాయం

రేవల్లి, జనవరి 4 : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని రేవల్లి, తలుపునూరు గ్రామాల మధ్యలో గల కెఎల్ఐ కాల్వలో పంట సాగు కోసం రైతులు కాలువలో దింపి వాడుకుంటున్న సంపు మోటారు, వాటికి సంబంధించిన కేబుల్ వైర్లు మాయమవుతున్నాయి. తలుపునూరు గ్రామానికి చెందిన గొల్ల ఏదుల రాములు అనే వ్యక్తి పంట సాగు కోసం మూడు నెలల క్రితం రూ.20 వేల ఖరీదు గల సంపు మోటార్‌ను కాలువలో దింపాడు. కాలువలో నీరు తగ్గిన తరువాత దొంగలు సంపు మోటార్‌ను, కేబుల్ వైర్లు కత్తిరించి దోచు కెళ్లారు. రాములు చుట్టుపక్కల ఉన్న పంట పొలాల్లో గల రైతులను అడిగినా, చుట్టుపక్కల ఎంత వెతికినప్పటికీ దొరకలేదు. దీంతో అతను పోలీసులకు సమాచారం తెలియజేశాడు. వారు మోటార్‌కు సంబంధించిన బిల్లు పేపర్లు తీసుకురమ్మన్నారని రైతు రాములు తెలిపాడు. కాలువలో ఉన్న మోటార్లు చోరీ చేయడం మొదటిసారి కాదని, గతంలో ఇలా మోటార్లు ఎత్తుకెళ్లారని ఆ దొంగలు దొరికారని, మళ్లీ ఇప్పుడు నీళ్లు తగ్గడంతో సంపు మోటార్లు, కేబులు, వైర్లు ఎత్తుకెళ్తున్నారని రైతులు వాపోతున్నారు. మోటార్లు వైర్లు ఎలా భద్రపరుచుకోవాలో తెలియడం లేదని ఎలాగైనా దొంగలను పట్టుకొని వారికి తగిన శిక్ష వేసి, తమ మోటార్లు తమకు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో మోటార్లు దొంగిలించిన ప్రాంతం

కల్లు దుకాణం దగ్ధం

గద్వాల, జనవరి 4 : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని మేలచెరువు గ్రామంలో గురువారం తెల్లవారుజామున కల్లు దుకాణం దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఈడిగ రామచంద్రయ్య గౌడ్ కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. గ్రామంలో అనుమతి లేకుండా మరో కల్లు దుకాణం కూడా ఉంది. బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లైసెన్సు ఉన్న కల్లు దుకాణాన్ని దగ్ధం చేశారు. గుడిసెతో పాటు అందులోని కల్లు సీసాలు కూడా ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి

వడ్డేపల్లి, జనవరి 4 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్ల మండల పరిధిలోని రామాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్నపై బోయ ఆంజనేయులు, శేఖర్ అనే వ్యక్తులు దాడి చేశారు. శాంతినగర్ ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తుండగా వారిద్దరూ అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి కర్రతో దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

గద్వాల, జనవరి 4 : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని సంగాల చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుర్వ కృష్ణయ్య (45) గేదెలను మేపుతూ బుధవారం చెరువులోకి వెళ్లాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సాయంత్రం వరకు వెతికినా లభ్యం కాలేదు. గురువారం మరోసారి గాలించగా, మధ్యాహ్న సమయంలో మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య రాధమ్మతో కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రషర్ పనులు నిలిపివేయాలి

నవాబ్‌పేట, జనవరి 4 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌడూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 352లో నూతనంగా చేపట్టిన క్రషర్ పనులు వెంటనే నిలిపి వేయాలని కోరుతూ ఆ గ్రామ రైతులు గురువారం రాష్ట్ర భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ రైతులు ఆంజనేయులు, గోపాల్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలో క్రషర్ మిషన్ ఏర్పాటు వల్ల పంటలు, తాగు నీరు కలుషితం అవుతుందని, అధికారులు స్పందించి పనులు నిలిపి వేయాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో రాములు, భీమయ్య, వెంకటయ్య, బీమయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌తో మోసం

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

జడ్చర్ల, జనవరి 4 : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట సమీపంలో సర్వే నెంబరు 277/అ/ఆలో 2020 డిసెంబరు 12న 122గజాల ప్లాటును కొనుగోలు చేసామని, అదే ప్లాటును రెండు సంవత్సరాల క్రితం మరో వ్యక్తిపై విక్రయించిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేశారంటూ జడ్చర్ల పట్టణానికి చెందిన ముడావత్ సుగుణ గురువారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్లాటును రాజ్‌కుమార్ అనే మధ్యవర్తి ద్వారా అల్తాఫ్ హుస్సేన్‌తో కొనుగోలు చేశామని, ఆ ప్లాటును డబుల్ రిజిస్ట్రేషన్ చేసి మోసం చేసారంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోపాల్‌పేట, జనవరి 4 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని డిన్నర్ కాలనీకి చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఏఎస్సై రాములు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన రాములు, బీసమ్మ కుమారుడు మోడల పరుశరాముడు, భార్య లావణ్యతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ప్రజాపాలన దరఖాస్తు చేసుకునేందుకు భార్యాభర్తలిద్దరూ స్వగ్రామానికి వచ్చారు. బుధవారం సాయంత్రం భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్థాపంతో పరుశరాములు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక అరవడంతో తల్లి బీసమ్మ మంటలను ఆర్పింది. అనంతరం భార్య లావణ్య వనపర్తి ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తల్లి బీసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాములు తెలిపారు.

పింఛన్ ఇస్తానని బంగారం దోచుకెళ్లిన దొంగ

భూత్పూర్, జనవరి 4 : నీకు పింఛన్ ఇస్తాను అని చెప్పి మెడలో ఉన్న బంగారు గొలుసును ఓ గుర్తు తెలియన దొంగ దోచుకెళ్లాడు. ఈ సంఘటన గురువారం భూత్పూర్ మునిసిపాలిటీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన కెంద్యాల సుశీల ఇంటి దగ్గర ఉండగా ఆమె బంధువు అయిన అమృతమ్మ అనే మహిళ మా ఇంటి దగ్గర పింఛన్ ఇచ్చే అధికారి వచ్చాడు, నిన్ను రమ్మని చెబుతున్నాడు అని చెప్పడంతో సుశీలమ్మ అమృతమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడే ఉన్న ఓ గుర్తు తెలియన వ్యక్తి నీ ఆధార్ కార్డు, పింఛన్ ఇచ్చే బుక్కు ఇవ్వమని అడిగాడు. ఇంతలో ఆ గుర్తు తెలియని వ్యక్తి తాను తెచ్చుకున్న స్కూటీపై సుశీలమ్మను ఎక్కించుకొని గ్రామంలోని బీసీ కాలనీ దగ్గర దించి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తీసుకొని అక్కడి నుంచి పారి పోయాడు. అతను వచ్చింది పింఛన్ అధికారి కాదని, దొంగ అని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

నర్సరీలో మొక్కలను జాగ్రత్తగా పెంచాలి

» జాయింట్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దమందడి, జనవరి 4 : గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా నర్సరీలో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని, నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. గురువారం పెద్దమందడి మండల పరిధిలోని మణిగిళ్ల గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలను పెంచుతున్న నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా త్వరగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పండ్ల మొక్కలు, పూల మొక్కల పెంపుదలకు కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అఫ్జల్, సర్పంచు సరిత, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

» జిల్లా సంక్షేమ శాఖ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న రామమహేశ్వర్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 4 : దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా ఐడీవోసీలోని సంక్షేమ శాఖ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులు, అంధులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రాయితీలను రామమహేశ్వర్ రెడ్డి తెలియజేశారు. అనంతరం ఆయన అంధులకు చేతికర్రలు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు, అంధుల అసోసియేషన్ సభ్యులు మోహన్, ప్రభు, స్వామి, విష్ణు, రాఘవేందర్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీవాణి

పాన్‌గల్, జనవరి 4 : విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలని జనరల్ స్పెషలిస్టు శ్రీవాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో 'బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలను వదిలేసి చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థినులు తమను తాము ఎలా రక్షించుకోవాలో వివరించారు. మహిళ హెల్ప్‌లైన్ 181, 100 నెంబర్ల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, సఖీ సెంటర్ అధికారులు సలోమి, సుమ, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు ఎదగాలి

» ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఐద్వా సంఘం సభ్యులు

వనపర్తి టౌన్, జనవరి 4 : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు ఎదగాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తొమ్మిదో వార్డు లక్ష్మీనరసింహ కాలనీలో ఐద్వా సంఘం నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటికీ మహిళల పట్ల జరుగుతున్న దాడులు, హింసలు, అత్యాచారాలను రూపు మాపేందుకు కలిసికట్టుగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీ, సహాయ కార్యదర్శి సాయిలీల, రేణుక, కవిత, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రెస్‌క్లబ్ నాయకులు

ఆత్మకూరు, జనవరి 4 : ఆత్మకూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసినట్లు గురుస్వాములు కూరగాయల రఘు, లక్ష్మణ్, అనిల్, శ్రీనివాసులు, జిన్నారం శ్రీనివాసులు తెలిపారు. ప్రతి ఏడు ఆత్మకూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగానే గురువారం అయ్యప్పస్వాములకు అన్నదానం చేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, ఆత్మకూరు మునిసిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రహమతుల్లా, మొగిలి గంగాధర్‌గౌడ్, ఆత్మకూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు జిందే శ్రీనివాసులు, రఫీ, ఆంజనేయులు, విజయ్‌కుమార్, తిరుమలేష్, శ్రీనివాసులుతో పాటు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యవేదిక కృషితో సమస్య పరిష్కారం

వనపర్తి టౌన్, జనవరి 4 : అఖిలపక్ష ఐక్యవేదిక గుర్తించి వెలుగులోకి తెచ్చిన సమస్యకు అధికారులు స్పందించారు. మంగళవారం అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాశింనగర్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గురువారం సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంలో ఉన్న విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించారు. అంతేకాకుండా త్వరలోనే నివేదిక సిద్ధం చేసి నిధులు వచ్చిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచి ఇబ్బందిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారని, అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పెబ్బేరు రూరల్, జనవరి 4 : మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కరుణాకర్ కుమారుడు 10వ తరగతి చదువుతున్న అశోక్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి గురువారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. దీంతో పాటు ఆ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి రూ.5వేలు సాయం అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పెద్దింటి పద్మ, మాజీ ఎంపీపీ సుజాత, నాయకులు వెంకటేష్, రాజశేఖర్, బుజ్జన్న, ఆంజనేయులు, రాముడు తదితరులున్నారు.

గ్రామ స్వరాజ్యంతో దేశాభివృద్ధి

» వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
» మణిగిళ్లలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ
» గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని హెచ్చరిక



మణిగిళ్లలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, జనవరి 4 : గ్రామ స్వరాజ్యంతో గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని, గాంధీ చెప్పిన మాటలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మణిగిల్ల గ్రామంలో జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి రూ.21 లక్షల మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ ద్వారా ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని రూ.24 లక్షల నేషనల్ హెల్త్‌మిషన్ నిధులతో నిర్మించిన నూతన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలకు హామీ ఇచ్చామని వాటిని అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజాపాలన ప్రతి నాలుగు నెలలకోసారి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు సరితాతిరుపతి, ఎంపీపీ రఘుప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, శేఖర్, పెద్దమందడి సర్పంచు వెంకటస్వామి, వెల్టూరు సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, చీకరుచెట్టుతండా సర్పంచు రాధాకృష్ణ, అమ్మపల్లి సర్పంచు రమేష్‌యాదవ్, డీఆర్డీవో నర్సింహులు, పంచాయతీ అధికారి సురేష్‌యాదవ్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో అఫ్జలుద్దీన్, నాయకులు వెంకటయ్య, వెంకటేష్ తదితరులున్నారు.

● పెబ్బేరు రూరల్ : పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి, గుమ్మడం గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీశైలం ముంపు నిర్వాసితులకు 98 జీవో పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. గుమ్మడం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తానన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మేఘారెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సుజాత, సువర్ణ, అక్కి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, రాంరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, గుమ్మడం నాయకుడు టీజీ.శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



అజ్జకొల్లులో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మదనాపురం : ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం అజ్జకొల్లు గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలను వందరోజుల్లో అమలుచేసే విధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహాంలింకన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ వాకిటి బ్రహ్మమ్మ, కాంగ్రెస్ నాయకులు జగదీష్, రామకృష్ణ, మహేష్‌కుమార్, శేఖర్‌రెడ్డి, వడ్డెకృష్ణ, కోటేష్, నాగరాజ్‌గౌడ్, రాజావర్ధన్‌రెడ్డి, సాయిబాబా, గొల్లశ్రీనివాసులు, వడ్డెబాలస్వామి పాల్గొన్నారు.

● శ్రీరంగాపూర్ : మండల పరిధిలోని శేరుపల్లి గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఎం.రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళి, ఎంపీడీవో ప్రసన్నకుమారి, గ్రామ సర్పంచు సునీత, కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● పాన్‌గల్ : మండల పరిధిలోని శాఖాపూర్, రేమద్దుల, రాయినిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచులు మౌనిక, మంజుల, చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సుబ్బయ్యయాదవ్, కరుణాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బాలరాజుయాదవ్, ప్రత్యేక అధికారులు లక్ష్మణ్‌నాయక్, సాజిద్‌రహమాన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పీపనగండ్ల : మండల కేంద్రంలోని ప్రజావేదికలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులతో పాటు, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎత్త కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచు నరసింహరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కొత్తకోట : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల నుంచి గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధులు దరఖాస్తులు చేయించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని విలియంకొండ, ఈదులబావి తండాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి యుగంధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ బాల్‌రెడ్డి ఎంపీడీవో కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా, సర్పంచులు నారమ్మ, శ్రీనివాసులునాయక్, శివరాజ్, శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాసన్న తదితరులున్నారు.

● చిన్నంబావి : మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 11 కౌంటర్లు ఏర్పాటుచేసి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. తహసీల్దార్ ఎండి.సుల్తాన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుగూరి రవినారాయణ, తదితరులున్నారు.

● ఆత్మకూరు : మండలంలోని మూలమల్ల గ్రామంలో 644 మంది, రేషన్‌కార్డు లేని వారు 286, ఆరేపల్లిలో 742, రేషన్‌కార్డు లేని వారు ఐదుగురు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు తెలిపారు. శుక్రవారం తిప్పడంపల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

● ఖిల్లాఘణపురం : మండలంలోని షాపూర్ గ్రామంలో తహసీల్దార్ పాండు, మల్కాపూర్‌లో ఎంపీడీవో విజయ్‌కుమార్, సురాయపల్లిలో ఎంపీవో రాజు ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. షాపూర్‌లో 535 మంది, మల్కాపూర్‌లో 227, సూరాయపల్లిలో 324 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు బాలాంజనేయులుగౌడ్, బాలస్వామి, మణెమ్మ, రాములు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, ఏవో మల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్, ఏపీవో సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● రేవల్లి : మండలంలోని నాగపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలనకు 790 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. అదేవిధంగా తలుపునూరు గ్రామంలో 884 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పరిశీలించారు. మండల స్పెషల్ ఆఫీసర్ దేశనాయక్, ఎంపీవో భవాని, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తకోట మండలంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



పీపనగండ్లలో ప్రజలతో దరఖాస్తు తీసుకుంటున్న ఎంపీడీవో, సర్పంచు

మూడోసారి కూడా మోదీనే ప్రధానమంత్రి

» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవని సతీష్‌మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న దేవని సతీష్‌మాదిగ

వనపర్తి అర్బన్, జనవరి 4 : దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ముచ్చటగా మూడోసారి దేశ ప్రధాని నరేంద్రమోదీ కానున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవని సతీష్‌మాదిగ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వికసిత్ భారత్-2024 కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, జిల్లా మీడియా ఇన్‌చార్జి పెద్దిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో 140 కోట్ల ప్రజల ఆర్థిక, అభివృద్ధికి, దేశ సమగ్రత, ప్రపంచంలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపే ప్రక్రియలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయం సాధించారని అన్నారు. దేశంలో 14 లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని యూపీఏ పేరు మార్చుకొని ఇండియా కూటమిగా ఎన్నికల్లోకి రాబోతుందని, ప్రాంతీయ పార్టీల తోకలు పట్టుకుని సముద్రాన్ని దాటాలని కాంగ్రెస్ కోరిక నెరవేరదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 15 లోక్‌సభ స్థానాలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలను బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలవబోతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమ్ము సామేలు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గోర్ల బాబురావు, పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, పట్టణ ఉపాధ్యక్షుడు పెద్దమారు రాము, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వారణాసి ఓంప్రకాష్‌చారి, యువ నాయకుడు రంజిత్ తదితరులున్నారు.

హైస్కూల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



హైస్కూల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు, జనవరి 4 : హైస్కూల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని జాతర మైదానం హైస్కూల్ విద్యార్థులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి పాఠశాలలో ఉప్పు నీటితోనే భోజనం చేస్తున్నా ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని, బయటకు వెళ్లి నీళ్లు తాగి వచ్చే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆరు బయటే కూర్చొని చదువుకునే పరిస్థితి దాపురించిందని, ఈ విషయంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు జిల్లా ఉన్నత విద్య అధికారులను ఆశ్రయించినా సమస్యను పరిష్కరించడం లేదని వాపోయారు. తక్షణమే పాఠశాలలో ఉప్పునీటి సమస్య పరిష్కరించి, విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు గదులు ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రమేష్, కుమార్, అంజి, కృష్ణ, నగేష్, సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

» తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఖాదర్‌పాషా



నూతనంగా ఎన్నికైన యూనియన్ నాయకులను సన్మానిస్తున్న టీజేఎస్ నాయకులు

వనపర్తి టౌన్, జనవరి 4 : జిల్లాలోని వెల్డింగ్, ఇంజనీరింగ్, మోటర్ వైరింగ్ చేసుకుంటు జీవనం సాగిస్తున్న కార్మికులు, కర్షకులను ప్రభుత్వం గుర్తించి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఖాదర్‌పాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో గల ఫంక్షన్ హాల్లో ఇటీవల ఎన్నికైన వెల్డింగ్ అసోసియేషన్ కమిటీ సభ్యులను ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాష్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఖాదర్‌పాషా మాట్లాడుతూ కుల వృత్తులకు ప్రభుత్వం సంఘ భవనాలు నిర్మించాలని, ప్లాట్లు ఇవ్వాలన్నారు. వెల్డింగ్, ఇంజనీరింగ్, మోటార్ వైరింగ్ పనులు ఎంతో ప్రమాదంతో కూడుకుంటాయని, అలాంటి వారికోసం ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కార్మికులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బ్రహ్మయ్యచారి, అధ్యక్షుడు కృష్ణయ్య, మెగా ప్రెసిడెంట్ మోహన్, మోటార్ వైరింగ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీహరి, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, శాంతయ్య, రాము, నరేందర్‌గౌడ్, టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ, రాఘునాయుడు, రాజేష్ కుమార్‌శెట్టి, గిరిరాజాచారి, జాత్యనాయక్, శంకర్‌బాబు, వినోద్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మెస్ బిల్లులు చెల్లించాలి

» ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది

వనపర్తి టౌన్, జనవరి 4 : ఐదు నెలలుగా గురుకులాల్లో ఉన్న పెండింగ్ మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ట్రైబల్ వెల్ఫేర్‌లలో గత ఐదు నెలలుగా రూ.5,485 కోట్ల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీనివల్ల గురుకులాల్లోని విద్యార్థులకు సరైన మెనూ అమలు కావడం లేదన్నారు. విద్యార్థులు నాసికరంగా ఉన్న భోజనాన్ని తింటు విద్యపై, ఆటపాటలపై సక్రమంగా శ్రద్ధ పెట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులు అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, అవినాష్ ఉన్నారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి

వీపనగండ్ల, జనవరి 4 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని గురువారం మండల వైద్య అధికారి డాక్టర్ వంశీకృష్ణకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శివర్గ సభ్యుడు మురళి మాట్లాడుతూ ప్రాణాలు పోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో అంబులెన్స్ సౌకర్యం ఉండేదని, ఇప్పుడు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఆశన్న, ఈశ్వర్, రామకృష్ణ, నవీన్ తదితరులున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పాన్‌గల్, జనవరి 4 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీరాములు చేతులమీదుగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సంఘమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌జీటీ మండల అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

పాన్‌గల్, జనవరి 4 : మండల కేంద్రంలో గురువారం ఇంటింటికి అయోధ్య రాముల వారి అక్షింతలను, చిత్రపటాన్ని హిందూవాహిని కార్యకర్తలు పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22న ప్రత్యేక పూజలతో పాటు, ఇంటింటా దీపాలు వెలిగించాలని కోరారు. పూజా కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యువకులు అశోక్, శివ, భాను తదితరులున్నారు.

సూగూరుకు చేరిన అక్షింతలు

పెబ్బేరు రూరల్, జనవరి 4 : మండల పరిధిలోని సూగూరు గ్రామంలోని శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయానికి అయోధ్య రాముని అక్షింతలు చేరాయి. ఈ సందర్భంగా తిరుపతి తిరుమల దేవస్థానం శ్రీవారి సేవకుడు సితార వెంకటేశ్వర్లు అక్షింతలను స్వీకరించి శ్రీరామ నామస్మరణ చేస్తు ఆలయ పూజారి రామకృష్ణశర్మకు అందించారు. సర్పంచ్ వెంకటస్వామి, ఆంజనేయులు, మాధవుడు, ఆంజనేయులు, నరసింహనాయుడు, వేణుగోపాల్, వెంకటేష్‌సాగర్ ఉన్నారు.